బీజేపీ సీనియర్ నాయకుడికి దత్తాత్రేయ పరామర్శ


రాజుతో మాట్లాడుతున్న దత్తాత్రేయ

నల్లకుంట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజును మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. ఇటీవల రంగంపల్లి రాజు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని బాగ్‌అంబర్‌పేట డివిజన్ పోచమ్మబస్తీలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలిసుకున్న దత్తాత్రేయ మంగళవారం వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకుని మానసికంగా, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా రంగంపల్లి రాజుకు దత్తాత్రేయ ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకాన్ని అందజేశారు. అనంతరం రంగంపల్లి రాజు కుటుంబ సభ్యులు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు శాలువాకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, సి.కృష్ణాగౌడ్, అచ్చిన రమేష్, పి.గోవర్ధన్‌రెడ్డి, చుక్కా జగన్, ఆర్.దేవేందర్, దడిగె జగన్‌యాదవ్, అచ్చుని మహేష్, వి.శ్రీనివాస్, సురేష్, వి.వెంకటేష్, బాలకృష్ణగౌడ్, బాల్‌రాజ్, ఆర్.రితిక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి

● అంబేడ్కర్ విగ్రహానికి నిరుద్యోగుల వినతి

చిక్కడపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని, గ్రూప్ 1 పరీక్షలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు, పోటీపరీక్షల అభ్యర్థులు దామోదర్ రెడ్డి, మహేష్, శ్రవణ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చిక్కడపల్లి లైబ్రరీకి వచ్చి తాము తెలంగాణలో అధికారంలోకి రాగానే ఉద్యోగ నోటిఫికేషన్ వేస్తామని రాహుల్‌గాంధీ హామీఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్‌లు విడుదల చేయకపోయినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరిగిన రాహుల్ గాంధీ తెలంగాణలో నిరుద్యోగులమీద అక్రమ కేసులు పెడుతున్నా, అక్రమ నిర్బంధం చేస్తున్నా కూడా స్పందించడంలేదని వారు ఆరోపించారు. కార్యక్రమంలో నరేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

'హిజ్రాల డిమాండ్లను పరిష్కరించాలి'

రాంనగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హిజ్రాల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని, విద్య, వైద్యం, ఉపాధి అవకాశం కల్పించాలని తెలంగాణ సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకట్వేర్లు, ఆలిండియా ట్రాన్స్‌జెండర్ల యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 3 లక్షల మంది హిజ్రాలు ఉన్నారని, వీరికి పక్కా గృహాలు, కమ్యూనిటీహాల్స్ విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. నవంబరులో ట్రాన్స్‌జెండర్, హిజ్రాల కల్చరల్ ఫెస్ట్ 2025 నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హిజ్రా, ట్రాన్స్‌జెండర్ల అసోసియేషన్ అధ్యక్షులు మోనాలిసా, పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, సామాజిక వేత్త సజయ, కొండవీటి సత్యవతి, మనోరమ, ప్రియ, శోభ, సమీరా, యశ్మీన్, శ్రావణి, సమంత తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు శుభ పరిణామం


సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

బర్కత్‌పుర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్య ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడం శుభపరిణామం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను ఆపాలని రెడ్డి జాగృతి సుప్రీంకోర్టులో వేసిన పిటీషన్‌ను కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని ఆయన అన్నారు. బీసీ రిజర్వేషన్లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9కి వ్యతిరేకంగా హైకోర్టులో రెడ్డి జాగృతి వేసిన పిటీషన్‌పై ఇంప్లీడ్ పిటీషన్ వేశానని ఆయన తెలిపారు. రెడ్డి జాగృతి బీసీ రిజర్వేషన్‌ను వ్యతిరేకించడం సరైంది కాదని, బీసీలకు అన్యాయం చేసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. హైకోర్టులో కూడా బీసీలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష పదవిలో కొనసాగుతా : శ్రీధర్‌రెడ్డి

ముషీరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నానని, తానే అధ్యక్షుడిగా కొనసాగుతానని ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న తనను పదవి నుంచి తప్పించాలనే కుట్రలు మానుకోవాలని అన్నారు. మరో సారి డివిజన్ అధ్యక్ష పదవి తనకే కేటాయించాలని పార్టీ నాయకులను కోరుతానని ఆయన తెలిపారు.

లేపాక్షి షోరూమ్‌లో డిస్కౌంట్ సేల్

రాంనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ గోల్కొండ (లేపాక్షి) దీపావళి పండగ సందర్భంగా ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని షోరూమ్‌లో డిస్కౌంట్ సేల్ నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజర్ గాయత్రీ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ఇప్పటికే అన్ని వస్తువుల రేట్లు తగ్గాయని దీనికి తోడు ప్రతి వస్తువుపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. నిర్మల్ పెయింటింగ్స్, బిగ్రీ వేర్, డ్వాక్రా క్రాఫ్ట్, చేరియాల్ స్క్రోల్ పెయింటింగ్స్, బంజారా నీడిల్ క్రాఫ్ట్, జువెలరీ, పెంబర్తీ గ్రాస్ వేర్, సిల్వర్‌ఫిలిగ్రీ, చీరలతో పాటు లెదర్ ఉడ్, ఫర్నిచర్ తక్కువ ధరకే లభిస్తున్నట్లు ఆమె తెలిపారు.

మహాకాళి ఆలయ హుండీ లెక్కింపు

ముషీరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని ప్రసిద్ధిగాంచిన మహాకాళి దేవాలయ అమ్మవారి హుండీ ఆదాయం రూ.67వేలా 300 వచ్చాయని ఆలయ కమిటీ చైర్మన్ నరేష్ తెలిపారు. మంగళవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు, ఈవో మహేందర్ కుమార్ పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్నం నాగభూషణం గౌడ్, ఆలయ ప్రధాన అర్చకుడు వై.చంద్రమౌళి, ధర్మకర్తలు అనసూయ, అశోక్ ముదిరాజ్, నాయకులు బాలరాజు యాదవ్, శ్రీకాంత్ యాదవ్, కిరణ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టండి


వెలగని వీధి లైట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లోని బస్తీలలో పాదయాత్ర నిర్వహించి వీధిలైట్లు వెలగని ప్రాంతాలలో వెంటనే వీధి లైట్ల మరమ్మతులు చేయాలని విద్యుత్ డీఈ అశోక్ కుమార్‌ను కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. మంగళవారం ఆమె బస్తీలో వెలగని వీధి లైట్లను పరిశీలించారు. డివిజన్ పరిధిలోని మోతీ మార్కెట్, చెప్పల్‌బజార్, కుద్బిగూడ, రాజేంద్రనగర్ కాలనీ, రెడ్డి కళాశాల లేన్, విక్రమ్‌నగర్ తదితర ప్రాంతాలలో వీధిలైట్లు వెలగడం లేదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన బస్ చార్జీలు వెంటనే తగ్గించాలి

● సిటీ బస్సులో ప్రయాణించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు


ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్, సుధీర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/ ముషీరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సిటీ బస్సుల్లో టికెట్ ధరలు పెంచడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్, సుధీర్‌రెడ్డి ఆరోపించారు. పెంచిన ఆర్టీసీ టికెట్ చార్జీలను నిరసిస్తూ మంగళవారం ఉదయం నాంపల్లి నుంచి అసెంబ్లీ వరకు ఎమ్మెల్యేలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. పెంచిన ధరలతో ఒక్కో ప్రయాణికుడిపై నెలకు రూ.500కు పైగా అదనపు భారం పడుతుందన్నారు. బస్ టికెట్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పెంచిన ధరలపై ప్రయాణికులతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో సామాన్య ప్రయాణికులపై ఆ భారం పడుతుందన్నారు. కాంగ్రెస్ పాలనకు ప్రజలు తగిన బుద్ధిచెబుతారని వారు హెచ్చరించారు.

పేద, మధ్యతరగతి ప్రజలపై భారం

ముషీరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నగరంలో పెంచిన ఆర్టీసీ బస్ టికెట్ ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిస్టేజీకి రూ.5 పెంచడం దారుణమని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలపై పెంచిన టికెట్ చార్జీల వల్ల అధిక భారం పడనున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, ప్రవీణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు మగ్బూల్ పాల్గొన్నారు.

గుస్సాడి ఉత్సవాలకు ప్రతీ గూడానికి రూ.50 వేలు ఇవ్వాలి

● కల్వకుంట్ల కవిత


కుమరం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కవిత

కవాడిగూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల కోసం గొప్ప పోరాటం చేసిన మహనీయుడు కుమరం భీం అని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొనియాడారు. కుమరం భీం 85వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహానికి కల్వకుంట్ల కవిత పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కుమరం భీం తన మరణంతో ఆదివాసీలకు ఎన్నో హక్కులను పర్మినెంట్‌గా సాధించి పెట్టారని గుర్తు చేశారు. ప్రతీ సంవత్సరం నవంబర్ నెలలో జరిగే గుస్సాడి ఉత్సవాల కోసం గత ప్రభుత్వం ప్రతియేటా ప్రతి గూడానికి రూ.25వేలు ఇచ్చేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా ఈ ఉత్సవాలకు రూ.50వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గూడాలలో అభివృద్ధి ఆగిపోయిందని మహిళలకు కనీసం ప్రసూతి సౌకర్యాలు లేని పరిస్థితి ఏర్పడిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై కుమరం భీం స్ఫూర్తితో జాగృతి పోరాటం చేస్తుందని అన్నారు. ఆదివాసీ హక్కుల పోరాటం కోసం త్వరలోనే కార్యచరణ ప్రకటిస్తామని కవిత ప్రకటించారు. ఆదివాసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్ రూప్‌సింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారితోపాటు జాగృతి నాయకులు కార్యకర్తలు ఆదివాసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భరత్‌గౌడ్ తదితరులు

రాంనగర్‌లో సమస్యలను పరిష్కరించండి

● బీజేపీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

రాంనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లో దీర్ఘకాలంగా పేరుకుపోయిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి బీజేపీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ వెస్లీచర్చి, పాలమూరి బస్తీలలో సివరేజీ సమస్య, నెహ్రూనగర్ ఏ, సర్వోదయ నగర్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, పాలమూరి బస్తీ తదితర ప్రాంతాలలో నూతన పైప్‌లైన్, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు స్పందించిన జీఎం శ్రీధర్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి వ్యయాన్ని అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం మోహన్‌రాజు, మేనేజర్ జీవన్‌జ్యోతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.పార్థసారథి, సీనియర్ నాయకులు పి.జయపాల్‌రెడ్డి, గాజుల కిరణ్ కుమార్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.


సుగుణా రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న మాధవాచారి

తరగతి గది దేశాభివృద్ధికి పునాది

నల్లకుంట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తరగతి గది దేశాభివృద్ధికి పునాది అని, విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించడానికి అవగాహన కార్యక్రమాలు ముఖ్యమని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ అండ్ వెల్ఫేర్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొట్టిముక్కల మాధవాచారి పేర్కొన్నారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి లేని భారత్ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ అండ్ వెల్ఫేర్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులుగా అమ్మనగంటి సుగుణా రెడ్డిని నియమించి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నాయకులు బైరి మాధవి, కోటగిరి ఉషారాణి, ప్రేమలత, ఎర్ర భాను తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయం వద్ద అన్నదానం

చిక్కడపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయం వద్ద మంగళవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భవానీ శ్రీనివాస్, స్థానికులు వాణీశ్వరశాస్త్రీ, గోపాల్, సత్యం, నర్సింగ్‌రావు, వనజారాణి తదితరులు పాల్గొన్నారు.

మూసారాంబాగ్ బ్రిడ్జిని పరిశీలించిన ట్రాఫిక్ ఉన్నతాధికారులు

అంబర్‌పేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ బ్రిడ్జిపై ట్రాఫిక్ రాకపోకలకు చేపట్టాల్సిన చర్యలపై నగర ట్రాఫిక్ ఉన్నతాధికారులు మంగళవారం అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తా సమీపంలోని మూసారాంబాగ్ బ్రిడ్జిని పరిశీలించారు. ఇటీవల నగరంలో కురిసిన భారీ వర్షాలకు ఉస్మాన్‌సాగర్ నుంచి గేట్‌లు తెరవడంతో వరదనీరు ఒక్కసారిగా మూసారాంబాగ్ బ్రిడ్జిపైకి చేరుకుని బ్రిడ్జి పై భాగం దెబ్బతిన్నది. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. ప్రత్యామ్నాయంగా గోల్నాక న్యూ బ్రిడ్జి నుంచి రాకపోకలకు అనుమతి ఇచ్చారు. ఈ బ్రిడ్జి చిన్నదిగా ఉండడంతో ఈ మార్గంలో ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో సమస్య పరిష్కారానికి నగర ట్రాఫిక్ డీసీపీలు శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు మూసారాంబాగ్ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలకు ఉన్న అవకాశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాములు, కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరకౌశిక్, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ట్రాఫిక్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'మంత్రులు భాష విషయంలో ఆదర్శంగా ఉండాలి'

చిక్కడపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ, దళితసంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ యునైటెడ్ క్రిష్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రధానకార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం సాయంత్రం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని అసోసియేషన్ ఆఫ్ 33 జిల్లాల క్రైస్తవులు, దళిత క్రైస్తవులు కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవులకు, దళిత క్రైస్తవులకు గౌరవం అవసరమన్నారు. మంత్రుల మధ్య సంభాషణలో దున్నపోతు వంటి అవమానకర పదజాలం వాడటం అసహ్యకరమైందన్నారు. ప్రజాస్వామ్యంలో పదవిలో ఉన్న మంత్రులు భాష వ్యవహార శైలి విషయంలో ఆదర్శంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ తిమోతి, ఉపాధ్యక్షులు పాస్టర్ మెనోజోయెల్, సభ్యులు బెనోమి రిచర్డ్, జయకుమార్ జాకస్, హేమలత, శాలిని తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

చిక్కడపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మరో మంత్రి పొన్నం ప్రభాకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎంఆర్‌పీఎస్ దక్షిణాది రాష్ట్రాల చైర్మన్ బీఎన్ రమేష్‌కుమార్ మాదిగ పేర్కొన్నారు. యావత్ మాదిగ జాతిని అవమానపరిచేవిధంగా మాదిగల మనోభావాలు దెబ్బతీసేవిధంగా వ్యాఖ్యలు చేసిన మంత్రి ప్రభాకర్ తక్షణం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

'సిగాచి' బాధిత కుటుంబాలకు రూ. కోటి హామీని నెరవేర్చాలి

● కమిషనర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా

చిక్కడపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమ ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రకటించిన కోటి రూపాయల హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికకమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ కోటి రూపాయల నష్టపరిహారం ప్రకటించి ఇప్పటివరకు 25 లక్షల రూపాయలు మాత్రమే ఇచ్చారని గాయపడిన క్షతగాత్రులకు పూర్తి పరిహారం ఇవ్వాలని, కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానకార్యదర్శి పి.భాస్కర్ మాట్లాడుతూ సిగాచి బాధిత కార్మికులకు న్యాయం జరిగేవరకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ సీఎం ప్రకటించిన పరిహారం చెల్లించకుంటే సీఎం ఇంటిముందు బాధిత కుటుంబాలతో కలిసి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. మల్లికార్జున్, రమ, వెంకటేష్, పద్మశ్రీ, సోమన్న, పాండురంగారెడ్డి, శాంతికుమార్, రాజు, శ్రీనివాస్, ప్రసాద్, చంద్రయ్య, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న శ్వేరోస్ హైదరాబాద్ జిల్లా నాయకులు

ముషీరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని శ్వేరోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తిమ్మన వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి నిరసనగా లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్వేరోస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్వేరోస్ నాయకులు ప్రకాష్, జానకీరామ్, ఉపేందర్, దినాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బహుజన, ప్రజా సంఘాల నిరసన

కవాడిగూడ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై సనాతన వాదుల దాడిని నిరసిస్తూ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం దళిత బహుజన, ప్రజా సంఘాలు నిరసన కార్యక్రమం నిర్వహించాయి. ధర్నాకు సంఘీభావం ప్రకటించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఈ దాడి కేవలం జస్టిస్ గవాయిపై కాదు యావత్తు దేశంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. జస్టిస్‌పై దాడి చేసిన నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలన్నారు. ఈ ధర్నాలో గద్దర్ ఫౌండేషన్ కార్యదర్శి సూర్యం, వివిధ దళిత, బహుజన ప్రజా సంఘాల నాయకులు పి.శంకర్, ఎద్దు దివాకర్, ప్రసాద్, రాజలింగం, రాజేష్, వి.యాదమ్మ, నవీన్, శారద, రవితేజ, రియాజ్, దీప్తి, కల్పన, ప్రకాష్, మీరా, రాజగోపాల్, వీరస్వామి తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రాజ్యాంగంపై, న్యాయస్థానాలపై దాడి

నల్లకుంట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి కాదు.. రాజ్యాంగంపై, న్యాయస్థానాలపై దాడి అని జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు పేర్కొన్నారు. మంగళవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ గవాయ్‌పై ఓ న్యాయవాది చెప్పును విసిరేందుకు ప్రయత్నించడం శోచనీయమన్నారు. చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి చార్జీషీటు దాఖలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

శ్రావ్యంగా ఏకగళ యుగళగీతాల ఆలాపన



శ్రీధరం రామసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుబ్బు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సింగ్ ఎలాంగ్ శీర్షికతో మంగళవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు పాల్గొని ఏకగళ యుగళ గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశంలో సేవాసంస్థ హ్యాండ్‌సమ్ స్కూల్ ఫ్రెండ్స్ గ్రూప్ మల్కాజిగిరి ఆధ్వర్యంలో గాయకుడు శ్రీధరం రామసుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీవీ, సినీనటుడు శేషకుమార్, ప్రముఖులు ఆనంద్, గోవింద్, రామకృష్ణ, రవి, కమలేష్‌దేశాయ్, వినోద్‌శర్మ పాల్గొన్నారు.

భజరప్ప నటులకు సదాస్మరణీయులు

చిక్కడపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నాటక నటునిగా దర్శకునిగా రంగస్థలంపై సాధికారత ఉన్న భజరప్ప నటులకు సదా స్మరణీయులని నాటకరంగ ప్రముఖులు పేర్కొన్నారు. సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో భజరప్ప స్మారక పురస్కారం ప్రముఖ రంగస్థల నటి బసవ హైమావతికి ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ నటులు ఎం బీబీ.శాస్త్రి పాల్గొని హైమవతికి పురస్కారం బహూకరించి మాట్లాడారు. నాలుగు దశాబ్దాలకు పైగా హైమవతి సాంఘిక పౌరాణిక నాటకాల్లో వివిధ పాత్రల్లో రాణించారన్నారు. రంగస్థల అధ్యాపకుడు ఆచార్య డి ఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో వెంకట్‌గోవాడ, భాషా, పెరుమాళ్, రాధాకృష్ణ పాల్గొన్నారు. మొదట ప్రేమ్‌కిషోర్ రచించిన గేమ్ నాటిక ప్రదర్శించారు.

ఏఐబీఎఫ్ జాతీయ సెక్రటరీ జనరల్‌గా ద్రోణంరాజు రవికుమార్


ద్రోణంరాజు రవికుమార్

రాంనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ (ఏఐబీఎఫ్) జాతీయ సెక్రటరీ జనరల్‌గా తెలంగాణ రాష్ట్రం నుంచి నగరంలోని విద్యానగర్‌కు చెందిన బ్రాహ్మణ సంఘం నాయకుడు ద్రోణంరాజు రవికుమార్ నియమితులయ్యారు. రాజస్థాన్‌లో ఈ నెల 5న జరిగిన ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ సమావేశంలో అధ్యక్షుడుగా ఎస్.డి.శర్మ నియమితులు కాగా ద్రోణంరాజు రవికుమార్ సెక్రటరీ జనరల్‌గా నియమితులైనట్లు ఫెడరేషన్ ఎన్నికల అధికారి కె.సీ.దావే మంగళవారం ప్రకటించారు.

కార్మికశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యుడిగా..

చిక్కడపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కార్మికశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్(ఏసీఎల్) ప్రభాకర్ నియమితులయ్యారు. టీజీఓ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో ఆయనను సభ్యులు ఎన్నుకున్నారు.

12న వీరశైవ లింగాయత్ వివాహ పరిచయవేదిక

బర్కత్‌పుర, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వర వధూవరుల వివాహ పరిచయవేదిక ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు విశ్వలింగాయత్ మ్యారేజ్ బ్యూరో నిర్వాహకుడు వసారం శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 12న మలక్‌పేటలోని సుభకరి ఫంక్షన్ హాల్‌లో ఈ వివాహ పరిచయవేదిక నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వర వధూవరులు ఈ వివాహ పరిచయవేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గుండె సంబంధిత అంశాలపై అవగాహన

చిక్కడపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గుండె నాళాల్లో అవరోధాలు ఏర్పడేవారికి, సకాలంలో రోగ నిర్ధారణ, డ్రగ్‌కోటెడ్ దీర్ఘకాలిక ఫలితాలను మెరుగుపరచడంలో సహాయపడుతుందని ప్రముఖ హృద్రోగ వైద్యనిపుణులు డాక్టర్ పంకజ్ జరివాలా అభిప్రాయపడ్డారు. మంగళవారం చిక్కడపల్లిలో గుండె సంరక్షణకు కొత్త విధానం మెటల్ స్టెంట్లు లేకుండా మూసుకుపోయిన ధమనులకు చికిత్స అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అప్పులు తీర్చలేక ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య

బర్కత్‌పుర, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేక ఓ ప్రైవేటు ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఈ విషాదకర సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. రత్ననగర్‌కు చెందిన శంకర్ యాదవ్ కుమారుడు ఏ.నరేష్(25) ప్రైవేటు ఉద్యోగి. వచ్చే జీతం సరిపోక నరేష్ స్నేహితులు ఇతరుల వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు డబ్బులు ఇవ్వాలని అడగగా అవి తీర్చలేక జీవితంపై విరక్తి చెందిన నరేష్ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్ని గంటల తర్వాత భార్య రోహిణి ఇంటికి వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు భార్య ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నరేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

'గాంధీ' ఎదుట గుర్తుతెలియని వ్యక్తి మృతి

కవాడిగూడ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ ఎస్ఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న మెట్రోపిల్లర్ 1026 ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి(50) మృతదేహం పడి ఉందని పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఆయన మృతదేహాన్ని గాంధీమార్చురికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో లేదా ఫోన్ నెంబర్ 8712569918, 8712661248లో సమాచారం అందించాలని ఎస్ఐ నర్సింహా సూచించారు. గాంధీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 10మందికి జైలు, జరిమానా

చిక్కడపల్లి అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాన్ని నడిపిన 10మందికి జడ్జి జైలుశిక్ష, జరిమానా విధించారు. చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం... స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాన్ని నడిపినవారిని నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. వారిలో ఒకరికి 3రోజుల జైలు శిక్ష రూ.3,100 జరిమానా విధించగా, మరో 9మందికి రూ.3,100 జరిమానా విధించారు.

బీటెక్ విద్యార్థిపై దాడి కేసులో ఐదుగురి అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ హరీష్‌కుమార్

అంబర్‌పేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో ఆదివారం రాత్రి దుర్గామాత నిమజ్జన వేడుకల్లో బీటెక్ విద్యార్థిపై జరిగిన దాడి కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్, అంబర్‌పేట సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం అంబర్‌పేట పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వారు వెల్లడించారు. ఉప్పల్ మేడిపల్లిలో నివాసం ఉంటున్న నరేష్ కుమారుడు అభినవ్ బీటెక్ చదువుతున్నాడు. ఈ నెల 5న బాగ్‌అంబర్‌పేట శ్రీఅయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి దుర్గామాత నిమజ్జన వేడుకల్లో పాల్గొని తిరిగి ఇంటికి వస్తుండగా శ్రీఅయ్యప్ప స్వామి ఆలయం వద్ద తురాబ్‌నగర్‌కు చెందిన డి.గౌతమ్, డి.సంపత్, బుర్జుగల్లీకి చెందిన యశ్వంత్, శివకుమార్, భాస్కర్ కలిసి అభినవ్‌పై బీరు బాటిల్స్ కర్రలతో దాడి చేశారు.